తెలంగాణం

# కవి సమ్మేళనాలు

దాశరథి

తెలంగాణాలో సారస్వత చైతన్యాన్ని కలిగించడానికి తోడ్పడిన ఉత్తమోత్తమమైన సాధనం కవి సమ్మేళనం. స్వయంగా కవి తన రచనల్ని పాడి వినిపిస్తుండగా విని ఆనందించనివారెవ్వరు! రేడియోవారు కవిసమ్మేళనాలు జరిపితే దేశమంతటా జనం రేడియో సెట్లువద్ద గుమికూడి ఆప్యాయంగా అర్ధరాత్రిదాకా కవితాగానం వింటారు. రేడియో అధికారులు ఆహ్వానించినా లేకున్నా తండోపతండాలుగా రసికులు హేమంత కాలపు రాత్రులలో రేడియోస్టేషనుకు కావ్యగానం వినడానికి రావడం ఎరుగుదుము. కళాశాలా వార్షికోత్సవాలు, గ్రంథాలయ సభలు, మహాపురుషుల జయంతులు, ఉగాది, దీపావళి మున్నగు పండుగలు జరిపేటప్పుడూ కవులను ఆహ్వానించి వారు తమ రచనలు చదువగా వింటారు. ఈ కవి సమ్మేళనాల్లో ఎంత ఆకర్షణ వుంది!

ఓరుగల్లుఖిల్లాలో—బాగా ఇప్పటికి పదేళ్ళ క్రితం మాట—ఒక పెద్ద కవిసమ్మేళనం జరిగింది. కీ॥ శే॥ సురవరం ప్రతాపరెడ్డిగారు అధ్యక్షులు. నిజాం నిరంకుశపాలన ముమ్మరంగా జరుగుతున్న రోజులు గనుక ప్రజాద్రోహులకు సాహిత్యోత్సవాలన్నా కష్టమంటే. ఖిల్లాలోని శిల్పాల నన్నింటినీ ముక్కులుచెక్కి, స్తనాలుచెక్కి వికృతంగా చేశారు ముష్కరులు. అలాంటి వికలావయవములతో మూల్గుతున్న శిల్పాలముందు ఈ కవి సమ్మేళనం జరిగింది. ఒక యువకవి మహోత్సాహంతో జనాన్ని మేల్కొల్పే గీతాలుపాడాడు. శ్రోతలు ఉద్రేకంతో పొంగిపోయారు. అన్ని పద్యాలు జ్ఞాపకంలేవుగాని వానిలో ఒకటి ఈ క్రింద ఇస్తున్నాను. చిత్తగించండి.

ఓ పరాధీన మానవా! సైపరాని
దాస్యము విదల్చలేని శాంతమ్ము మాని
తలుపులను ముష్టిబంధాన కలచివైచి
చొచ్చుకొని పొమ్ము స్వాతంత్ర్య
సురపురమ్ము.

ఎంత ప్రయోజనాత్మకంగావుందో చూడండి ఈ గీతం! ఇలాటి గీతాలు ధ్వనించిన ఆ కవి సమ్మేళనాన్ని వినడానికీ చూడడానికీ ఏకశిలాపురీ జనం వేల సంఖ్యలోవచ్చారు. కళ్ళారా ఆ కవి సమ్మేళనంచూచి ఆనందాశ్రువులు రాల్చిన రసికులు అనేకులు. అంతకుముందూ, ఆ నాటి నుండీకూడా ఏ సమావేశం జరిగినా కవి సమ్మేళనంలేకుండా పోలేదు. వీనితో సంతృప్తిపడక మిత్రులు తమతమ ఇండ్లలో అప్పుడప్పుడూ చిన్న చిన్న గోష్ఠులు జరిపితే తెల్లవార్లూ కవులు పాడుతుండగా వింటుండేవారు. ఈ సంప్రదాయాన్ని చక్కగా అమలు జరిపినవారు "సాధన సమితి" వారు. మిత్రుడు శ్రీ వెల్దుర్తి మాణిక్యరావు నానావిధ ఫలాహారాలతో తన ఇంట్లో గోష్ఠులు ఏర్పాటుచేసి కావ్యగానం జరిపించేవాడు. ఇవి కేవల మనోహ్లాదానికే అనుకోండి. అయితే ఇదీ ప్రయోజనమే కదా!

నిజాంరాష్ట్ర ఆంధ్రమహాసభ తెలంగాణంలో ఏకైక రాజకీయసంస్థగా వెలుగొందిన కాలాన ఆ సభావేదికనుండి కవులు యథేచ్ఛగా జాగరణ గీతాలు ఆలపించి జనాన్ని ఉత్తేజితుల్ని చేశారు. తరువాత మహబూబునగరంలో, మంచిర్యాలలో, తూపురాణిలో, ఓరుగల్లులో, నల్లగొండలో చాలా పెద్ద యెత్తున కవిసమ్మేళనాలు జరిగి అశేష ప్రజాదరాన్ని పొందినవి.

పోలీసుచర్య తరువాత భాషాభిమానం తెలంగాణంలో మరీ అధికం కావడంవల్ల ఒక్క గత సంవత్సరం తెలంగాణంలో జరిగిన కవి సమ్మేళనాల్ని లెక్కవేస్తే సగటున మూడు రోజులకొకటి జరిగింది. వీనిలో చాలా పెద్దవి అలంపురం సారస్వత సభల్లోని కవి సమ్మేళనం, హైదరాబాదులో ఇటీవల జరిగిన తెలంగాణా రచయితల సంఘం

వార్షికోత్సవాల సందర్భాన జరిగిన కవితాగోష్ఠి. ఈ సమ్మేళనాల్లో ఇంతటి మహాశక్తికి కారణం యేమిటి? దీనికి కారణం కేవల కవుల రచనాశక్తి మాత్రమే కాదు. వారు పాడి వినిపించడంకూడా కారణం. వారు ఎంత మనోజ్ఞంగా రాస్తారో అంత బాగా చదువుతారు. బాగా చదవలేని వాళ్ళూ కొందరున్నా కవి రచనను కవే చదువుతుండగా వినాలని శ్రోతలకు ఆసక్తి. రెండు మూడేళ్ళ క్రితం హైద్రాబాదు రేడియోకేంద్రం వారు పెద్ద కవిసమ్మేళనం ఏర్పాటుచేశారు. విశ్వనాథ, దేవులపల్లి, జాషువా, బాపిరాజు, కాటూరి, వేదుల, పురిపండా, నారాయణబాబు, గణపతిశాస్త్రి, విశ్వేశ్వరరావు ప్రభృతి ప్రముఖులు అందులో పాల్గొన్నారు. నండూరి సుబ్బారావు గారుకూడా అప్పుడు దయచేశారు. ఈ పెద్దలు హైద్రాబాదు నగరంలో నివసించిన మూడు నాలుగురోజులు ఒకటే కవి సమ్మేళనాలు. విసుగూ, విరతీ లేవు.

తెలంగాణంలో ముఖ్యంగా బహుళ ప్రజను ఆకర్షించిన ఇరువురు మువ్వురు వ్యక్తుల్నిగూర్చి ఇక్కడ ముచ్చటిస్తాను. వీరిమూలాన జనానికి కవి సమ్మేళనాలపై ఆసక్తి బాగా ప్రబలింది. ఈ మువ్వురు వరుసగా శ్రీ వానమామలై వరదాచార్యులు, శ్రీ సి. నారాయణరెడ్డి, శ్రీ కాళోజీ నారాయణరావు. వరదాచార్యులవారు ఎన్ని గంటలు కావ్యగానం చేసినా విసుగురానంత అమృతదిగ్ధగళం ఆయనది. ఎంతచక్కని కంఠమో అంతచక్కని శయ్యారామణీయకం,అంతకమ్మని భావాలు. "తెలంగాణంలోని పల్లెపట్టుల్ని వల వేసి పట్టుకున్నారీయన" అన్నాడు ఆరుద్ర.

కసిదీర కుప్పించి గంతులువైచు లే
గల కయి నాట్య రంగంబ వగుదు
మనసార మేసి రోమంథాల నిదురించు
పశువులకై పూల పాన్పవగుదు
మెడమెడ నొరయుచు కడుచూడ్కులన్ గను
హరిణాల ప్రణయ మందిరమ వగుదు
ముత్యాలు తాపిన మొఖమలు ఫరషువై
విబుధుల స్వైరంపు విడిది వగుదు
కదలకయె గంతులిడెదు లేగలను గూడి;
నిద్రబుత్తు 'జో'పాట యేనియును లేక
గుంపులుగ జేరి యేకాంత గోష్ఠిసేతు
తృణమవగుచు బ్రహ్మానందము నిడుచుందు.

—"తృణము"నుండి.

ప్రొద్దుతో నీవును పోవుచుండిన యంత
దెసలు కొమ్ములుమాడ్చి మసకలయ్యె,
పరిమళ్లు నీ పోక నరిసి నెఱ్రియ నోళ్ల
ఝిల్లికా రావాల చేరబిల్చె,
ఈవు లేమికి తిండి నిచ్చగింపక బంతి
పక్షులుం గూళ్ళకు పయనమయ్యె
పోవుచీ గతి నీవు త్రోవ చూపవె చీమ
పేరటాండ్రును పొక్క దూరుచుండె
చెఱువు కాల్వకన్నీట నేడ్చెడిని రొదల
పొలముగూడ నెంతయుఁ జిన్నబుచ్చె
మొగము;
అరుగుచుంటివి గడియైన నాగకుండ
తిరిగి యెన్నాళ్ళ కీచూపు? పరిగపిల్ల!

—"పరిగపిల్ల"నుండి.

తెలంగాణంలోని నవమండలాలలో (ఖమ్మం ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేయబడడంవల్ల ఇప్పుడు తొమ్మిదిజిల్లాలైనాయ్) ఈయన నెరుంగని వారు, ఈయన కావ్యగానమును విని ఆనందించనివారు అరుదు. పోతనయే తిరిగి అవతరించినాడా అనునంతటి సౌమ్యభావము, నిరాడంబరత ఆజానుబాహు విగ్రహము, చక్కని జిజ్ఞాసాపరత ఈయనయందు మూర్తీభవించినవి. అశేషప్రజాదరణమును పొందిన ఈ మహాకవిని ఈమధ్య ఒక అనామకుడు కొన్ని అవ్యక్తములైన మాటలచే క్రొత్తగా పరిచయము చేయించబూనినాడు—చండభానుని దివిటీచే చూప యత్నించినట్లు, ఈయన నివురుగప్పిన నిప్పువలె అజ్ఞాతుడుగా నున్నాడని పొరపడినాడు పాపము! క్రొత్తగా పర్వత ప్రాంతములనుండి వచ్చి దేశంలో ఇప్పుడిప్పుడే అడుగుపెట్టెనా యేమి ఈ విమర్శకుడు!

మహోదారములై, అత్యుదాత్తములైన భావాలలో కడుచక్కని శైలిలో రచనచేయకల మరొక కవి శ్రీ సి. నారాయణరెడ్డి. ఈయన అనేక గీతికాసల్లాపకాలు వ్రాశారు. ఇవి ఆడబడినవి, పాడబడినవి. ఇక్కడి మహిళా కళాశాలవారు వీరి సల్లాపకాలను సాభినయంగా ప్రదర్శించి వానికి

దృశ్యతా, శ్రవ్యతా గౌరవం (Audio-visual lucidity) చేకూర్చి పెట్టారు. తన గీతి నాటికాలను ఈయన పాడుతుండగా వినటంకన్న మహాభాగ్యం మరోటి లేదనుకుంటారు యువతీయువకులు. నవ్వనిపువ్వు, వలపురేడు, భిన్నస్వరాలు, దగ్ధశాంతి మున్నగునవి కర్నూలు, అనంతపురం, గుంటూరు మున్నగు ప్రశస్త ప్రదేశాలలో సారస్వతోత్సవాలసందర్భాన ఈయనచే గానం చేయబడి, ఆంధ్రదేశంలోని ప్రముఖ సాహిత్యకుల మన్ననల నందినవి. కవిసమ్మేళనాలు జరుగుతుంటే జనం 'సి.నా.రే వాంటెడ్' అని కేకలు వేస్తారు. మదబంభరీ పక్షాంచలాలవలె మోమున వ్రాలుతున్న ముంగురులతో, నూనూగు మీసాలతో సభారంగంమీద కావ్యగానం చేయడానికి ఈయన ప్రత్యక్షం అయ్యేసరికి అతిభీకరమై, శృంగారికతా మోహనమై, మధురతా మంజులమైన ఆయన గొంతు వినడానికి అశేషజనం నిశ్శబ్దంగా కూచుంటారు. ఈయన రచించిన గీతికాసల్లాపకాలు అటుంచి ఈయన ఖండకావ్యాలలోని సలక్షణములైన పద్యాలు, మహోత్తేజకరములైన మర్మాఘాత గీతాలు (Whipping Poems) పాబ్లో నెరుడా రచనల్ని జ్ఞప్తికి తెస్తాయి.

"జిజ్ఞాస పెచ్చుపెరిగిన కొద్ది
విజ్ఞానం వేళ్లు తన్నిన కొద్ది
జగత్తునుండి చంద్రబింబానికి
రహదారులు తీసే
రహస్సుల్ని శోధించడానికి
తహతహలాడే"

మనస్సు ఈయనిది. గొంతెత్తి—

"లోకంలో కల్లోలం లేపి
మానవతా మందారం నలిపి
ప్రపంచ శాంతిని భగ్నంచేసే—
ప్రఫుల్లకాంతికి బాటలు మూసే"

దానవత్వాన్ని తిరస్కరిస్తాడు.

"నాకనుల వెలిగించు నవదీప కళికా!"
నాభావి జీవనానందాల మొలకా!"

అని మధురంగా నిశ్వసిస్తాడు. ఈయనదొక ఉజ్జ్వల వాక్కు.

మూడవ మహాశక్తి శ్రీ కాళోజీ నారాయణరావు. హాస్యోల్బణంతో సమ్మిశ్రితమైన అంతస్సత్యాలను పేదశబ్దాల్లో మనకు అందిస్తాడు.

"ఎవరికి చేపని ఎండిన చన్నులు
రసవిహీనములు రాజకీయములు" అని

రాజకీయాల్ని ఎడమకాలితో తన్ని సారస్వతోద్యమానికి నాయకుడై సాగిపోతున్న గంభీరవ్యక్తి. పక్షపాతంలేని దృష్టి ఈయన కలానికి వుంది. ఈయన పసేమీ పాడడు చదువుతాడు. శ్రీ. శ్రీ. వలె చదువుతాడు. ఈయన చదువుతుంటే ప్రతి పంక్తి శ్రోతలకు చక్కిలిగింతలు పెడుతుంది. పక్కలు చెక్కలయ్యేట్టు నవ్వుకుని ఒకనిమిషం ఆగి ఆ నవ్వించిన పంక్తులు తమహృదయాల్లోని కల్మషాన్ని ఎలా తోడిపారేస్తున్నాయో గమనించి ఆశ్చర్యపడతారు.

"నశ్యం అంటేనే ఏవగింపు
జరదారూపంలో గిట్టును కంపు."

* * *

రాయి రువ్వినా రాకెట్ విసరినా
గిట్టని వానిని కొట్టుటకే గద!
అకు కట్టినా కోక చుట్టినా
తోచినకాడికి దాచుటకే గద!
కన్నుగీటినా కమ్మవ్రాసినా
కామవృత్తినీ కదపుటకే గద!"

* * *

బ్రతుకును కష్టతరంచేసెడి విజ్ఞానం
మూలమును క్లిష్టతరం చేసెడి వ్యాఖ్యానం
ఎక్కుకొలది క్రుంగిపోవు సోపానం
విలుకానినే హతమార్చు విషబాణం

ఇట్లా విచిత్రంగా చదువుతాడు తన గీతాల్ని. వచనంలా గేయాల్ని చదివి జనాన్ని నిశ్శబ్దం చేయగలశక్తి ఈయనకు ఒక్కడికే దక్కింది అని చెప్పాలి తెలంగాణంలో.

ఈపైన పేర్కొన్న "త్రిపుటి" వలన తెలంగాణంలో కవితోత్సవాలు పెండ్లిండ్లవలె, హోళికోత్సవాలవలె అత్యంత ఆనందావహంగా, ప్రజామనోహ్లాదకరంగా, విజ్ఞానదాయకంగా గ్రామగ్రామాన జరుగుతున్నాయి. వీనివలన యువకవులెందరో ప్రజలకు పరిచితులౌతున్నారు. వారి కవిత జనాదరాన్ని పొందడానికి ఆస్కారం ఏర్పడుతున్నది. ఇటు కవులూ అటు రసికులైన

శ్రోతలూ కవిసమ్మేళనాల్ని కాంక్షిస్తున్నారు. ఇదే సందర్భాన నేనొక విచిత్రమైన మరొక కవిసమ్మేళనవిధానాన్ని గూర్చి ముచ్చటిస్తాను. ఇది బహుభాషా కవిసమ్మేళనం. హైద్రాబాదు రాష్ట్రం ఆంధ్ర, మహారాష్ట్ర, కర్ణాటప్రాంతాల కూడలిగనకను, హైద్రాబాదు నగరంలో ఈ మువ్వురు భాషాభాషులే కాక హిందీ, ఉరుదూ, తెలుగు, మహారాష్ట్ర, కర్ణాటభాషలు అయినా వచ్చును. ఈ సమ్మేళనాలు ఎలా జరుగుతాయో మనవిచేస్తాను.

ప్రధానంగా ఇట్టి సమ్మేళనాలను హిందీ ప్రేమీమండలివారు ఏర్పాటు చేస్తుంటారు. వీరు ప్రాంతీయ భాషావికాసానికి ఎట్టివిఘాతం కలుగకుండా హిందీ భాషా ప్రచారం చేయాలనే సంకల్పంతో దేశం నలుమూలలా అశేషంగా కృషిచేస్తున్నారు. మాతృభాషలో పాండితి ఏర్పడనిదే హిందీభాషా నిష్ణాతృత్వానికి అర్రులు చాచరాదనీ, "మొదట మాతృభాష, తరవాత హిందీ" అనీ సహృదయంగా ప్రచారం చేస్తున్న భాషాసేవకులు వీరు.

వీరు ఈమధ్య చాలాచోట్ల ఇట్టి బహుభాషా సభలు ఏర్పాటు చేశారు. వీనిలో ఒకటి ఉద్గీర్ సభ. ఉద్గీర్ పట్టణం మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన బిదర్ మండలంలోనిది. ఇక్కడికి కర్ణాట సాహిత్యపరిషత్తు అధ్యక్షులు, ప్రముఖ కర్ణాటకవి శ్రీ సద్దియ్య పురాణిక్ "కావ్యానంద" గారు. ప్రశస్త మహారాష్ట్రపండితులు శ్రీ ఆర్. యం. జోషీగారు, అఖిలభారత ఖ్యాతినార్జించిన హిందీ కవి శ్రీ భవానీప్రసాద్ మిశ్రాగారు, ఉరుదూకవి "షాహిద్" గారు, తెలుగువాణ్ణి నేనూ, హిందీ ప్రేమీమండలి నాయకులు శ్రీ వేమూరి ఆంజనేయశర్మగారి నాయకత్వాన ఒక శుభదినాన ఉదయం (మూడు నెలల క్రితంమాట ఇది. తేదీ జ్ఞాపకంలేదు) హైద్రాబాదునగరంనుండి పంచభాషా సమ్మేళనంలో పాల్గొనడానికి బయలుదేరాము. ఉద్గీర్ ఇక్కడికి బాగా నూటాఏబది మైళ్ళదూరం. అరుణధూళిపటలాలు మేఘాలుగా మమ్మల్ని చుట్టుకుంటుంటే (అంతా ఎర్రనేల) జీపులో మహావేగంతో ప్రయాణించాము. రాష్ట్ర వ్యావసాయిక విభాగమంత్రి శ్రీ యం. చెన్నారెడ్డిగారు అధ్యక్షులు. ఆయన అనుగ్రహంగా హిందీలో భాషాసామరస్యాన్ని గూర్చి, ప్రాంతీయ భాషావికాసాన్ని గూర్చి మాట్లాడి కావ్యగానం చేయవలసిందిగా మమ్ములను ఆమంత్రించారు. అక్కడ గుమిగూడిన వేలాదిజనంలో ఇంచుమించు అంతా మహారాష్ట్రం ఎరిగినవారే. అయితే కొద్దిమంది కర్ణాటం తెలిసినవారూ వున్నారు. మొత్తంమీద మా కవిత్వాన్ని హిందీలో వివరించి చెబితే తెలియనివారుండరు. రాత్రి 12-30దాకా జరిగిన పంచభాషాకవిసమ్మేళనం ఎంతో మనోహరంగావుంది. కర్ణాటకవి సిద్దయ్యగారు తన గేయానికి అర్థం మొదట హిందీలో వివరించి చెప్పి కన్నడంలో పాడడం ప్రారంభిస్తే జనులు ముగ్ధులై విన్నారు. నేనూ జోషీగారు హిందీలో వివరణంతో మా కవిత్వాలు వినిపించాము. అయితే మమ్మల్ని మళ్ళీమళ్ళీ పాడమని జనం అభ్యర్థించడం మేము మూడు పర్యాయాలు పునరావృత్తి విధానాన్ని అనుసరించి కావ్యగానం చెయడాన్ని బట్టి అక్కడి జనానికి కవితపై ఎంత ఆసక్తియో అర్థమైంది. ఇక హిందీ కవి భవానీప్రసాద్ మిశ్రా 'సన్నటా' అన్న గేయం పాడుతుంటే మహోత్సాహంతో జనం వినడాన్ని చూస్తే ఆశ్చర్యంవేయకమానదు. "సత్పుడా కే జంగల్" "మైఁ గీత్ బేచ్తాహూఁ" వంటి ఆయన గీతాలు సుధాదిగ్ధమధురాలు. ఇదొక విచిత్రానుభూతి నాకు. ఆ పిమ్మట మరి కొన్నిచోట్ల ఇలాటి కవిసమ్మేళనాలు జరగడం మా మిత్రులైన పంచభాషా కవులు పాల్గొని ఆ సభల్ని కవితా పంచాయతనాలుగా మలచడం ఎంతో బావుంది. ఇక్కడ మహారాష్ట్రులకు కర్ణాటులకు శ్రీ శ్రీ, విశ్వనాథ మున్నగువారిని గూర్చి తెలుసును. మాకు "కాంత్" మున్నగు మహారాష్ట్ర కవుల్ని గూర్చి తెలుసును. మేము పరస్పరం హిందీలో మాట్లాడుకుంటాము. ఒకరి కవితలోని ఘనతను ఒకరు తెలుసుకోడానికి హిందీ మాధ్యమంగా ఉపయోగపడుతున్నది.

ఇలా ప్రసాదవంతమైన వాయుమండలంలో ఇక్కడ సాహిత్యోద్యమం కవిసమ్మేళనాలు ఆలంబనంగా కార్తికిక చంద్రికా మోహనమై వికాసిస్తున్నది.

మేము కవిత్వాన్ని, సాహిత్యాన్ని బాధ్యతాయుతమైన ప్రజోపయోగ కార్యక్రమంగా భావిస్తున్నాము. సాహిత్యం ప్రజల్నీ, వారి జీవితాల్నీ సునాయాసంగా మార్చగలుగుతుంది గనక కవిత ప్రజల్ని విజ్ఞానవంతుల్ని చేస్తుంది, వాళ్ళు ఆరోగ్యవంతంగా జీవించడానికి తోడ్పడుతుంది. వాళ్ళల్లోని భావాల్ని పెకలించి పైకితీస్తుంది, మానవులు జిజ్ఞాసువులు కావడానికి తోడ్పడుతుంది, ప్రక్కవాణ్ణి అనురాగంతో చూడడం నేర్పుతుంది, కవిత్వం సమాజానికి మానసికాహారం.

కవిసమ్మేళనాలు కవులకు అపకారంచేస్తున్నాయని కొందరు అసహిష్ణువులు, స్వోత్కర్షాపరులు ప్రలాపిస్తున్నారు. వీణాతంత్రికా ఝంకారం ప్రక్కన ఓటుతప్పెట ప్రమోతలవంటి ఈ కువిమర్శలు అనాదరణీయములు. భారతం పదునొకండుసార్లు పఠించినవారూ, కృష్ణశాస్త్రి పన్నెండుసార్లు "ఆకులో ఆకునై" అన్న గీతం పాడగా విన్నవారు, శ్రీ శ్రీ మరోప్రపంచం పదమూడు తడవలు ఆలకించినవారు పునఃపునశ్శ్రవణాసక్తులై పఠనాసక్తులై వున్నట్టు కవి రచియించిన గీతంలోని మాధుర్యాన్ని గ్రోలగల సంస్కారం వున్న రసికుడు ఫలానా కవి ఎప్పుడూ అదే పాట పాడతాడని విసుగుకొనడు. త్యాగరాజ కీర్తన ఎన్నివేలసార్లు ఎన్ని వందలమంది గాయకులు పాడినా వింటున్నాం. కాళిదాసు మేఘదూతంలోని రెండువందలైనా లేని పద్యాలు ఎన్నివేలసార్లు వల్లెవేశాం మేము! ఇంకా తనివితీరదే! కాళిదాసు ఈనాడు సజీవుడై మన కవిసమ్మేళనాలలో పాల్గొన గలిగితే "మహాకవీ! మేఘదూతంలోని మందాక్రాంతాలు పాడునాయనా!" అని ప్రార్థిస్తాము. ఆయన "కశ్చిత్ కాంతా విరహగురుణా" అని కంఠమెత్తితే తన్మయులం కామూ! ఆ పద్యం ఎన్నిమాట్లు విన్నది! ఎన్నిమాట్లు తాత్పర్యసహితంగా వల్లెవేయబడినది! ఛాత్రులకు ఎన్నిసార్లు పాఠంచెప్పినా కుమారసంభవం విసుగనిపించేది గాదు మా గురువులకు. "అస్త్యుత్తరస్యాం దిశి" అనేసరికి ఆయనకు అత్యున్నతములైన సుశీతల హిమాచల శిఖరాలు, వాటి కొసలమీద తొణికిసలాడే ఉదయభాను కరాలు స్ఫురించి కన్నీరు మున్నీరై పోయేవాడు. సాధారణ మేఘాన్ని అసాధారణ పుష్కలావర్తజలదంగా కల్పించిన మహాకవి కాళిదాసు వాక్కు ఏనాడైనా పాతపడుతుందా! అలాగే ఏ ఉత్తమకవి గీతమైనా. వరదాచార్యులు గారు ఎన్నోసార్లు వినిపించిన పద్యం మళ్ళీ వినిపిస్తే పొంగిపోయి వింటాము. "శ్రీ శ్రీ మార్కు పద్యాలనే వాడుకు" కొత్తగీతం కాదు. అయినా ఎప్పుడూ కొత్తగానే వుంటుంది. "Unhousel'd, disappointed, unanel'd" అంటూ ప్రొఫెసరు వెంకటాచారిగారు "హామ్లెట్"లోనుండి గంభీరంగా సంగీతం పాడుతుంటే షేక్స్పియర్ మహాకవి సృష్టించిన అమరపంక్తి హృదయాల్లో గుసగుసలు పెడుతుంది. శరీరానికి పాతదనంగాని వాక్కుకు పాతదనం ఎక్కడిదయ్యా!

---

"కళలన్నిటిలోను సాహిత్యం ప్రథమశ్రేణి అలంకరిస్తున్నది. ఈ సాహిత్యం దాదాపు పూర్తిగా ప్రతిభా సముపన్నం. ఇది లక్ష్యాలను బట్టికాని, సిద్ధాంతాలను బట్టికానిపోదు. భావనాస్వాతంత్ర్యం కల్పించి చిత్తవిస్తారం కలిగిస్తుంది. ఒక విశిష్ట ప్రత్యయం భాసింపజేస్తుంది. ఈ ప్రత్యయంతో సంవలితాలై నిరవధిక నానావిధభావాలు బయలుదేరుతవి. ఈ భావాలు ఈ ప్రత్యయార్థాన్ని మహత్తర భావంలో లయింపజేస్తవి. ఈ భావం ప్రకాశింపజేయటానికి ఎలాంటి అభిధాశక్తీ చాలదు. సాహిత్యం మనస్సుకు ఆత్మశక్తులను స్ఫురింపజేస్తుంది. తన శక్తులు ప్రకృతికి అతీతాలనీ, ఈ ప్రకృతి కేవలం భౌతికమనీ స్ఫురింపజేస్తుంది. అంతేకాదు. ఈ ప్రకృతిని అతీంద్రియార్థగ్రహణకు నిమిత్తమాత్రంగా పరిగణింపజేసి, మనస్సును సంస్థితం చేస్తుంది. యథేచ్ఛగా సాహిత్యం ప్రతిభాసను కల్పిస్తుంది."

—(జి. వి. కృష్ణరావు: "జేగంటలు"నుండి.)

అభిప్రాయ వేదిక

# "కవిసమ్మేళనాలు" : ఒక విమర్శ

వెల్దండ ప్రభాకరరావు

తెలంగాణమందు నేడు సభలు - సమావేశాలు బహుళంగా జరుగుచున్నవి. అందును కవిసమ్మేళనములుగూడ విరివిగానే జరుగుచున్నవి. 1954 మార్చి 19వ తేదీ "తెలుగు స్వతంత్ర"లో "కవిసమ్మేళనాల"ను శీర్షికతో నొకవ్యాసము వ్రాసి శ్రీ దాశరథిగారు చాలా దుమారం గుప్పించినారు. అందలి యథార్థతను తెలుపుటయే యీ వ్యాసముయొక్క ముఖ్యోద్దేశ్యము. సభలను గూర్చి నొక ఆంగ్ల సాహితీవేత్త "ఒకరు చేయలేని పనిని నలుగురు కూడకలిసి యేమిచేయజాలరని నిశ్చయమునకు వచ్చుట కేకగ్రీవంగా తీర్మానించుటే"యని నిర్వచనమిచ్చినారు. ఇట్టి సభలు తెలంగాణములో సర్వసాధారణములైనవి.

కవిసమ్మేళనములయొక్క పరమోద్దేశ్యమున కొంతమంది కవులకు వారివారి రచనలను సాహితీపిపాసువులకు వినిపించుటకు కొంత యవకాశము లభించును. దానివలన, యనగా నట్లు లభించిన ప్రోత్సాహంవలన, తన ప్రతిభా విశేషమునకు, రచనా పాటవమునకు దోహదము కలుగుట, శ్రోతలలో కొందరికైనా కవితాకన్యపై వ్యామోహం కలిగి నిరంతర సాధనాఫలితముగా వారు నొక్కనాడు కవికుమారులగుట సంభవమగును. ఇది నుభయులకు తారకమంత్రమే. అయితే యందరు కవిత నాస్వాదించగలుగుదురా? అది యెట్టి కవిత? అధునాతనమా? సనాతనమా? పురాతనమా? భావకవిత్వమా? అభావకవిత్వమా? యిట్టి ప్రశ్నలు తప్పక నుద్భవించును.

"సంగీతం సాహిత్యంచాపి సరస్వతీః కుచద్వయం
ఏకమాపాద మధుర మన్యదాలోచనా మృతం"

అన్న నార్యోక్తి ప్రకారం కవిత్వము లోచనామృతము. ఆ భావము స్ఫురించువరకు రచయిత కొంత నుక్కిరిబిక్కిరగుటకలదు. ఇట్టి కవిసమ్మేళనము వేలాదిప్రజలు వచ్చి యానందించారనుట పట్టి బూటకము. పైగా నోరుగల్లు కోటలో జరిగిన కవిసమ్మేళనం విషయం నాకు తెలుసును. అజ్ఞాత కవులందరు నేకత్ర గుమిగూడి తమ కవితావాహినిని కొందరికి పరిచయం చేసినారు. వారినుద్ధరించి పైకెత్తవలెనను పరమాదర్శంతో వెలువడిన సంస్థ నిజాం రాష్ట్ర ఆంధ్ర సారస్వత పరిషత్తు. (ని. రా. ఆ. సా. ప.) నాకు వ్యక్తిగత విమర్శలతో ప్రసక్తి లేదు. వాస్తవములు తెలుపవలసినప్పుడు కొన్ని సంస్థలను పేర్కొనక తప్పదు. బాగుగా స్థాపితమైన ని. రా. ఆ సా. ప. చేయుచున్న పనియేమి? కేవలం సంకుచిత భావంతో, ఆశ్రితపక్షపాతంతో నిండియున్న యీ సంస్థ తనసభ్యుడైన, ఏకైక తెలంగాణ మహాకవి శ్రీ వానమామలై వరదాచార్యులవారి పోతన గ్రంథరచనకు కారణభూతులు కాలేకపోయినారు. ప్రభుత్వసహాయం లభించుచున్నను దాన్ని దుర్వినియోగంచేసి సభలకు, సమావేశాలకు ఖర్చుపెట్టి పాటుపడుచున్నారు. తెనాలిలో జరిగిన నవ్యసాహిత్యపరిషత్తు దశమ సమావేశానికి వెళ్ళితిని. వారతిథులకుచేసిన సత్కారము నేను చెప్పజాలను. మంచిర్యాలలో, అలంపురంలో జరిగిన సభలలో యెంత మందికి భోజనప్రాప్తికల్గిందో నాకనుమానం.. వెళ్ళవద్దని వారించినను వినక వెళ్లిన మిత్రుడిఅనుభవమది. రామకృష్ణపరమహంస పరివ్రాజకుడై దేశములు దిరుగుచున్నప్పుడొక వృద్ధబ్రాహ్మణుడు రామాయణం చదువుతూ కన్నీరు మున్నీరుగా నేడ్చుచుండెను. ఈ వింతనరయబోయిన రామకృష్ణపరమహంసకు రామాయణార్థమెరుంగజాలని యతడు "ఉదర నిమిత్తో బహుకృతవేషః" యని సమాధానమిచ్చినాడు. ఇది కేవల మాత్మవంచన. కవిసమ్మేళనము వినుటకు వచ్చిన వేలాదిరసికులుకూడా నిట్టివారే తెలంగాణమందు రసికులేలేరని కాదు నాఉద్దేశం

తెలంగాణమందు వేలాది రసికులే ఉన్న ప్రతికవి యొక్క కావ్యము ప్రతియొక్కొక్కటి కొన్నవు రచయితలకిట్టి దుర్గతి పట్టదు. అది శ్రీ దాశరథికి తెలియనిది కాదు. వ్రాయవలెనన్న యావేదన జీర్ణమైన తర్వాత వారిట్టి రచనలను వ్రాయుటకు పూనుకొనినట్లున్నది. అంతేగాదు వారీవ్యాసంలో పొరపాటున "సాధనసమితి" పేరును సూత్రప్రాయంగా ముచ్చటించి యందు శ్రీ వెల్దుర్తి మాణిక్యరావును మాత్రమే ప్రశంసించినారు వారు కేవలం మాణిక్యరావును మాత్రమే ప్రశంసింపదలచిన ప్రచురించే పత్రికలుంటే పెద్దపరిచయములు వ్రాసుకోవచ్చును. ఎవ్వరిసహాయం లేకుండా సాధనసమితి 1937లో స్థాపింపబడి వివిధరంగాల్లో నేటివరకు 20 గ్రంథములను ప్రచురించి రచయితలనెందరినో పరిచయం చేసింది. వెల్దుర్తి మాణిక్యరావే సాధనసమితి సర్వస్వమను భావం స్ఫురించినట్లుగా వ్రాయుట సాహసము. అంతకంటె నేను విశేషించి వ్రాయను. వారికి (అనగా వెల్దుర్తికి) మహాకవి యామోదము లభించిందంటే (ఏ కావ్యాలు వ్రాయకపోయినను. కావ్యమంటే కేవలం సనాతనమని కాదు. ఏదైనసరే) వారు శాశ్వతంగా సాహిత్య క్షేత్రంనుండి విరమించుకోవచ్చును.

ఇంక తెలంగాణా రచయితల సంఘం కవిసమ్మేళన ప్రసక్తి తెచ్చినారు. వీరికి రాష్ట్రేతరుడు, తెలంగాణవాసుడను సంకుచిత భావాలున్నను వాటిని తమ యతిథి సత్కారమువలన కప్పిపుచ్చుకొనుటకు కొందరు ప్రముఖులను (అనగా రాష్ట్రేతర కవులను. శ్రీశ్రీని ఆరుద్రను) పిలిచారు. అయితే వారికొక సందియం కలిగింది. ఆ విషయాన్ని బట్టబయలు చేసినారు. మహాకవి గొంతులో వచ్చి వెలక్కాయపడ్డది. వారన్న విషయము మనవిచేస్తాను. "తెలంగాణంనుంచి దాశరథి, నారాయణరెడ్డి, కాళోజీగారి పేర్లే మాకు వినవచ్చుచున్నవి. మరెవరి పేర్లు వినబడవు అయినను మహాకవులగు పైమువ్వురి యెదుట మేము మాట్లాడునదేమని" అన్నారు. తెలంగాణ పరిస్థితుల నిట్లు వారు సుస్పష్టంగా వ్యక్తంచేసినారు. పైగా కవి సమ్మేళనమునకు కొంతమందికాహ్వానం లేదు. పోనీ పిలిచినవారిలో కావ్యగానము చేయుట కావకాశ మొసంగినవారును చాలా తక్కువ. ఎవరికో అవకాశమీయబడినను అధ్యక్షపీఠ మలంకరించిన నొక సుప్రసిద్ధ కవియతని చొక్కాబట్టి లాగుచు దిగిపొండని కేకలు. అయితే రసజ్ఞులప్పుడే అసలు కవి ఎవడో ప్రజాభిమాన మెవరికి కలదో వారిని దింపివేసినారని మరునాడు విరుచుకపడినారు. పోతే దాంట్లో అవకాశం లభించినది మహాకవికి, సి. నా. రె. కు, వెల్దుర్తి మాణిక్యరావునకు. మూడవవారు వేదికకు ఎక్కక ముందే నేను చదువుచుండగా మీరీ పద్యము లడుగుడని యభ్యర్థించిన నాత్మీయులు, నాప్తులు వాటి నడుగుటవలన గొంతులతరబడి వారు గజగజ వణుకుతున్నను చదువుట. ఈ సన్నివేశం మరొక విషయాన్ని జ్ఞప్తికి తెచ్చుచున్నది. ఒక రచయిత తన రచనను ప్రకటితమయినచో వచ్చు పరిహారాన్ని యూహించి దానికి వచ్చు కార్డులు కొని యొందరిచేతనో జాబులు వ్రాయించి రచన ప్రకటింపబడుటలో సఫలీకృతుడైనాడు. ఇట్టి సంకుచిత భావములతో వీరు సాహిత్య సేవచేయవచ్చును. రచనలు వ్రాసి గౌరవమును పొందనిండు. ఇటీవలనే ఆంధ్రపత్రిక సంపాదకీయం వ్రాస్తూ రచనలనుబట్టి రచయితల గౌరవాన్ని నిర్ణయించుట జరుగుటలేదు తద్వ్యతిరిక్తము నేడనుసరింప బడుచున్నదని నిర్భీతిగ వాకొన్నది. అట్టిది కాలదోషమేమో? అయితే "తస్మైకాలాయనమః" స్థానిక వారపత్రికలో సి. నా. రె. తన memoirs వ్రాసుకొన్నాడు. మహాకవిగారు దీనికి recognize చేసినారు. వర్ధిష్ణు రచయితకు ప్రోత్సాహమివ్వవలసిందే. అయితే కావలసినదానికంటె ఎక్కువగా వ్రాయుటవలన కవి భవిష్యత్తుకే గొడ్డలిపెట్టని నా అభిప్రాయం.

తెలంగాణంలో బహుళప్రజ నాకర్షించిన మువ్వురి వ్యక్తుల్నిగూర్చి ప్రశంసయున్నారు. ఈ సందర్భంలో ఒక్క విషయం. శ్రీ వానమామలై వరదాచార్యులకు స్వతస్సిద్ధమగు ప్రతిభ కలదు. వారిని ప్రశంసించుట ప్రయోజనకారియే. కాని యట్టి మహానుభావునితో సరిపోల్చి తలిమ్మానిద్దరిని కూడ ప్రస్తావించుట యది మహాకవికి సమంజసమేమో, (intentional or otherwise)నాకు

తెలియదు. కవిసమ్మేళనాలను శీర్షికపై నవకాలికులగు కవులనెందరినో విడచి, వీరి మువ్వురినే ప్రశంశించుట వారి సంకుచితభావమునకు ప్రబలమగు తార్కాణము.

ఇట్టి పాక్షిక ప్రచారాన్ని ఖండిస్తూ స్థానిక తెనుగుదేశ వారపత్రికాముఖమున "ఉదధి" వ్యాస పరంపరలు ప్రకటితమగుచున్నప్పటికి వీరికి జ్ఞానోదయము కలుగలేదు. అహం వున్నంతవరకు కలుగదేమో?" చేతస్సరసిజమును సమర్పించు భావం మొదటికే రాదేమో? 'ఉదధి'యను ప్రచ్ఛన్న రచయితను ప్రశంసిస్తూ మరల ఖండిస్తూ వ్రాసి తత్పరిణామముగు తీవ్ర విమర్శకు గురియైన విషయము నిప్పటికైన జ్ఞప్తికి తెచ్చుకోవలయును. 'ఉదధి' ఎండిపోయినదన్నారు. మహాకవిగారి కవిసమయము కాదుకదా సాగరమెండుట. తెలంగాణయని కేకలువేయక కవితాధారనింకి పోకమునుపే కావ్యరచన చేయవలసిందని కోరుచున్నాను. ప్రతిభలేనివారిని పొగడుటాత్మవంచన- పరులను వంచించుట కూడా. ఇంతకంటె వ్రాయజాలను- దోషనిర్ణేతకిది యంకితమగుగాక.

కథానిక

# రికార్డు బుక్కూ, రామేశం

తాసీరా

"స్సారీ, మీ రికార్డు బుక్కు మావూళ్లో పెట్టి మరిచిపోయి వచ్చాను" అంది విజయలక్ష్మి. కాని ఆమెలో ఆ మాటన్నప్పుడు 'సారీ' తాలూకు జాడలేవీ లేవు. నవ్వుతూనే అంది. పక్కనున్న లేడీ స్టూడెంట్సు చిన్నగా నవ్వారు.

"అరె, ఎట్లాగిప్పుడు!" అని మెల్లిగా, కాసేపు చుట్టుపక్కలు చూసి, ఎవరూ రావటంలేదుగదా అని సంతృప్తిపడి, ఆదుర్దాగా, ఒణుకుతూ, అన్నాడు రామేశం. కాని ఏరీ వాళ్లు? అల్లంత దూరాన వెడుతున్నారు. రామేశం దిమ్మరతిరిగి పోయాడు. ఏం జవాబది, అర్థంలేని జవాబు! పైగా అలా నవ్వటుందేమిటి? చేసిన తెలిమాలిన పనికి విచారించక. సరిగా జవాబైనా ఇవ్వకుండా ఇట్టే వెళ్లిపోయిందేం? రామేశానికేం అర్థంకాలేదు. ముఖాన్ని అసమర్థత సూచించే విచారపు ఛాయలు కమ్ముకున్నాయ్. అక్కడ్నుంచి లైబ్రరీకన్నా వెళ్ళకుండా, తిన్నగా రూం చేరుకొన్నాడు. వళ్ళనర్థంలేకుండా కొరుక్కుంటూ పుస్తకాలను టేబిల్‌మీద విసుగ్గా పారవేసి, కుర్చీలో కూలబడ్డాడు.

ఎంత పని చేసింది విజయలక్ష్మి! ఛీ, అసలు కాలేజీ లేడీస్టూడెంట్సును నమ్మగూడదు. ఒక్కోసారి వాళ్ళు మెత్తవారిని ఆటలు ఆడిస్తారని, బాధిస్తారని, తనీ కాలేజికి వచ్చిన తరువాతనే విన్నాడు. అసలు తనెందుకిచ్చాడు ఆమెకు రికార్డు? ఇవ్వక ఏం చేస్తాడు ఆ సమయంలో. సెలవులు రేపిస్తారనగా, "ఏమండీ, మీ రికార్డు కొంచెం ఇస్తారా సెలవుల్లో రాసుకుని ఇస్తాను. అందులో మీరు రికార్డును చక్కగా రాసి, అందంగా అట్టే పెడ్తారట" అని నవ్వుతూ మధురంగా అంది; ఒంటరిగా, ఎవ్వరూలేరు పక్కన. తనకేం తోచలేదు. ఆమె అందమైన ముఖంలోకి చూచాడు నిస్సహాయంగా. అంతే, ఇక రికార్డు ఆమెకు ఒణుకుతూ ఇచ్చి వూరుకొన్నాడు. దాన్ని మళ్ళీ ఎప్పుడిస్తారనిగాని, త్వరగా ఇవ్వాలి సుమా అని గాని అనలేదు. అసలెక్కడా నోరు పిడచగట్టుకుపోయి మాటరాకపోతేనే!

ముందెలా? రికార్డు లేకపోతే ప్రాక్టికల్సుకు అటెండ్ గానీయడుగదా లెక్చరరు. ఎట్లా, ఏం చేయటం? ఆమెను తొందరగా తీసికొని రావాల్సిందని నొక్కి చెప్పాలి. కాని ఆమె ముందర ఆ నొక్కి చెప్పటం సులభసాధ్యమైన పనిగాదు. అసలామెను కలుసుకోవాలంటే తన మనస్సుకెన్నో అడ్డంకులు. పక్కనెవరూ లేకుండా చూసిగాని మాట్లాడలేదు. వెధవలుచూచి ఏమో పుకార్లు పుట్టిస్తారు. ఇంకో బాధావుంది. ఒకవేళ కష్టపడి, ఎవరూలేకుండా చూసి ఆమెను కలుసుకోవాలంటే ఆమె ఒక్కతే వుండదు. పక్కన

# కవి సమ్మేళనాలపై కువిమర్శ

దాశరథి

"....విమర్శకతతిన్ డీకొంచు గంగానదీ
నీలాంభస్సదృశాతివేగత ప్రయాణించున్ కవిత్వమ్ము"

**1954** మార్చి 19వ తేదీ "తెలుగు స్వతంత్ర"లో నేను "కవి సమ్మేళనాలు" అన్న శీర్షికతో ఒక వ్యాసం రాశాను. తెలంగాణాలో సారస్వత చైతన్యం కలిగించడానికి ఉపయోగపడిన ఉత్తమోత్తమమైన సాధనం కవి సమ్మేళనమని రాశాను. కవి సమ్మేళనాలు ఇక్కడ ఎలా జరుగుతాయి, అవి విజయవంతంగా నిర్వహింపబడడానికి తోడ్పడిన కవిరాజులు ఎవరెవరో కూడా రాశాను. కవి సమ్మేళనాలు కవులకు అపకారం చేస్తున్నాయని కొందరు కువిమర్శకులు చేస్తున్న పెడవాదాన్ని ఖండించాను. ఈ కవిసమ్మేళనాలు దినదినం ప్రజాదరాన్ని పొందుతూ ఒక్క తెలుగులోనేగాక మహారాష్ట్ర), కర్ణాట, హిందీ, ఉరుదూ భాషల్లో విరివిగా ఈనాటికీ జరుగుతున్నాయి. పోలీసు చర్య జరిగిన రెండేళ్ళకు డా॥ బూర్గుల రామకృష్ణరావుగారి అధ్యక్షతన రెడ్డి హాలులో సాధన సమితి యాజమాన్యాన ఆంధ్ర కర్ణాట కవి సమ్మేళనం జరిగింది. రేడియో వారు దీన్ని దేశమంతటికీ వినిపించారు. ఉద్గీర్‌లో ఈ మధ్య డా॥ చెన్నారెడ్డి (ప్లానింగు మంత్రి) అధ్యక్షతన జరిగిన సభలో ఆంధ్ర, కర్ణాట, హిందీ, ఉర్దూ భాషల సంయుక్త కవి సమ్మేళనం జరిగింది. జయ ఉగాదినాడు హైద్రాబాదు, విజయవాడలలోని రేడియో కేంద్రాలలో తెలుగు కవి సమ్మేళనాలు జరిగి అశేష ప్రజాదరాన్ని పొందాయి.

మద్రాసులో, గుంటూరులో, కర్నూలులో, అనంతపురంలో మరి అనేక ప్రముఖ స్థలాలలో కవి సమ్మేళనాలు విజయవంతంగా జరుగుతున్న వార్తలు పత్రికలలో చూస్తున్నాం. వీనిమూలాన రెండు ప్రయోజనాలు కలుగుతున్నాయి. ఒకటి: ప్రజలు ముఖాముఖి కవులను దర్శించుకుని వారి వారి ముఖతః కవిత వినడం. రెండు: యువకవులు అనేకులు ప్రజలకు పరిచయం కావడం. ఇది ఇటు ప్రజలకు అటు కవులకు శ్రేయోదాయకములైనవేగాని నష్టదాయకమైనవి కావు.

ఇట్టి కవిసమ్మేళనాలనుగురించి నా వ్యాసాన్ని నిష్కారణద్వేషంతో విమర్శించడానికి ఒక వ్యక్తి 1954 ఏప్రిల్ 2వ తేదీ "తెలుగు స్వతంత్ర"లో పూనుకున్నారు. నా వ్రాతకు జవాబుచెప్పబోయి ఆంధ్ర సారస్వత పరిషత్తునూ తెలంగాణా రచయితల సంఘాన్నీ, నన్నూ, వెల్దుర్తి మాణిక్యరావుగారినీ ఇష్టంవచ్చినట్టు నిందించారు. అనేక అప్రస్తుతాంశాలను తన విమర్శలో తీసుకొనివచ్చారు. వ్యక్తిగత దూషణకు కూడా కడంగినారు. ఈ విమర్శకుని యోగ్యతాయోగ్యతలు, వ్యక్తిత్వము మున్నగువానినిఅటుంచి ఈయన ఆంధ్రసారస్వత పరిషత్తుపై చేసిన ఆరోపణలకు పరిషత్తు ప్రధాన కార్యదర్శి శ్రీ పులిజాల హనుమంతరావుగారు జవాబు ఇచ్చారు. పరిషత్తు నిర్వహించిన, నిర్వహిస్తున్న కార్యకలాపాలను సాకల్యంగా తెలియజేస్తూ పరిషత్తు కార్యకర్తలు చేయలేని కొన్ని కార్యముల జాబితాను ఇచ్చి మహోపకారము చేశారు. ఇక తెలంగాణా రచయితల సంఘము చేయుచున్న చేసిన కార్యకలాపములను రచయితల సంఘ ఉపాధ్యక్షుడనుగా పాఠకలోకమునకు తెలియపరచవలసివుంది. తెలంగాణలోని తొమ్మిది జిల్లాలలో అనేక శాఖలతో విలసిల్లుతూన్న సంస్థ తెలంగాణా రచయితల సంఘం. తెలంగాణా విముక్తి ఉద్యమంలో అశేషత్యాగాలు చేసి తన జీవితమునే దేశానికి అంకితం ఒనరించిన సుప్రసిద్ధ దేశభక్తులు, విఖ్యాత కవి శ్రీ కాళోజీ నారాయణరావు అధ్యక్షులుగా దినదినాభివృద్ధి నందుతున్న ఈ సంస్థ తెలంగాణమందలి శేముషీధురంధరులైన రచయితలను ఏకసూత్రానకూర్చి తెలంగాణ సారస్వత వికాసానికి ప్రశంసాపాత్రమైన కృషి సలుపుతున్నది. దీనికి తార్కాణంగా ఈ సంఘం ప్రకటించిన కొన్ని పుస్తకాలను ఉద

హరిస్తాను. వీనిలో మొదట పేర్కొనవలసినది "ఉదయ ఘంటలు." ఇది యావదాంధ్ర భూమికి చెందిన యాభై ఆరుగురు కవుల కవితల కదంబం. ఈ కదంబం వైతాళికుల తరువాత సంపూర్ణ రూపాన వెలువడిన సంపుటిగా వివిధ ప్రముఖపత్రికల, విమర్శకుల మన్ననల నందుకొన్నది. ఆంధ్ర కవితాచరిత్రలో మైలురాయివలె నిలిచిపోగల ఈ సంపుటిని గూర్చి శ్రీ వాత్సవగారు "తెలుగు స్వతంత్ర"లో ఇలా అన్నారు:

"ఈ సంవత్సరం—చిరకాలం తర్వాత కవితా సంపుటాలు వచ్చాయి. అందులో ఉత్తమమైనది వేసిన గౌరవం తెలంగాణా వారికే దక్కింది. అఖిలాంధ్ర కవుల రచనలతో కూడిన "ఉదయ ఘంటలు" ఒక గొప్ప కృషి అని చెప్పక తీరదు. ఇందులో యాభైయారుగురు రచయితలు వ్రాసిన ఎనభై రచనలున్నవి. సంపాదకులన్నట్లు 'ఇందులో ఎవరూ ఏ జండాలూ ఎగరేసినట్టు కనబడదు. కైదండల నెత్తి సరాసరి నిశ్చింతగా ప్రయాణంచేసే మనకు ఏ జండా అండ ఎందుకు? రాగబంధంలో యావజ్జగత్తును కట్టివేయగలం. అప్పుడు అంతా కలిసికట్టుగా శాంతిని సాధించుకోనూగలం. కిర్మీర రుచిమంతమైన సుప్రభాత సమయాన ఆశాపక్షాంచలాల్ని కదలిస్తూ ఘంటలు మనదాకా వస్తున్నవి. "ఇదిగిదిగో! ఉదయ ఘంటలు. ఇదిగిదిగో హృదయ ఘంటలు-" అని నివేదించారు. 'నిద్రాణ, నిస్త్రాణ, నిష్ప్రాణ లోకాన్ని కవితా నవసంజీవినీ గుళికతో మేల్కొల్పడమే' అన్న తమదీక్ష సార్థకం చేసుకున్నారు. సాధ్యమైనంతవరకు అప్రకటిత రచను సేకరించి వేశారు. ఇటువంటి సంపుటి వేయడం చాలా కష్టమైన పని. "వైతాళికుల" తర్వాత మరొకటి వెయ్యాలని శ్రీ శ్రీ. అస్మదాదులం తలపెట్టాం. అది సాధ్యమే కాలేదు."

శ్రీవాత్సవగారివలెనే ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రిక మున్నగునవి తమ అమూల్యమైన ప్రశంసల నందించినవి. ఇవిగాక "తెలుగుతీరాలు" "చిరుగజ్జెలు" "నినాదం" "రాగజ్యోతులు" మున్నగు ప్రచురణలను వెలువరించి ఆంధ్రసాహిత్యానికి కానుకలుగా అందించింది తెలంగాణా రచయితల సంఘం.

నవీనులైన సాహిత్యకులతో కూడుకున్న ఈ సంఘం ప్రాచీన ఆంధ్రసాహిత్యాన్ని ఏవగించుకోలేదు సరికదా ఆంగ్లవాసనా మగ్నమైన ఈనాటి యువలోకానికి ప్రాచీనకావ్యాలమీద పురాణాల మీద ఆసక్తి, ఆదరం కలిగించడానికి నగరంలోనూ, జిల్లాల్లో "ప్రబంధ పఠనగోష్ఠి" అను కార్యక్రమాలను నిర్వహించి నన్నయనాటినుండి నేటిదాకా గల పురాణాలు కావ్యాలు మున్నగు వాటిలోని సుందరఘట్టాలను గానంచేసి వినిపించి ప్రాచీన గ్రంథములను ఏవగించుకొను వారికిసైతం చవులూరజేసినది. శిరోమణి గప్పగంతుల లక్ష్మణశాస్త్రి, నారాయణరెడ్డి మున్నగువారు అతి జటిలములైన ప్రబంధాలలోనుండి కొన్నిఘట్టాలు గానముచేస్తే విని తలలూచనివారుండరు. రాఘవ పాండవీయంలో రగడలను నారాయణరెడ్డిగారిచే పాడించుకుని విన్న రసికుల నెరుంగుదును. ఈ విధంగా ఆధునిక, పురాతన గ్రంథములపై ఆసక్తిని తెలంగాణంలో పెంపొందించిందీసంస్థ. ఈనాడు తెలంగాణమున ఉదీయమానులైన యువకవులు మల్లికార్జున్, సంపత్కుమార, రామసర్సయ్య, సుప్రసన్న, కనపర్తి, మాదిరాజు మున్నగువారిని ప్రోత్సహించి వారి వీపుతట్టినది సంఘం. భిన్నభిన్న రాజకీయోద్యమాలకు చెందిన వారిని సాహిత్యవేదికపై ఏకమొనర్చి భేదభావమును రూపుమాపగలిగినది. సాహిత్యముతో ఎట్టి సంబంధములేని ఎడ్వకేట్లను కార్యవర్గ సభ్యులుగాను, అక్షరజ్ఞానము లేనివానిని ప్రధాన కార్యదర్శిగా కాక, విద్యావంతులగు వారిని, త్యాగశీలురను, ప్రముఖపండితులను కార్యవర్గ సభ్యులుగా గన ఈ సంస్థ విభిన్నాభిప్రాయాలు గల వారి మన్ననల నందినది. ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆంధ్రశాఖాధ్యక్షులు ఆచార్య శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనముగారు ఈ సంఘముయొక్క ఇరువురు ఉపాధ్యక్షులలో ఒకరు. యావదాంధ్ర యువకలోకమునకు గర్వకారణులైన శ్రీ సి. నారాయణరెడ్డిగారు ఈ సంఘమునకు ప్రధాన కార్యదర్శి. ఎం. ఏ. పట్టభద్రులు. "నవ్వని పువ్వు" "జలపాతం" "విశ్వగీతి" వంటి పుస్తకాలు రచ

యించి అశేష ప్రజాదరాన్ని పొందారు. "పోతన చరిత్రము" అను కావ్యమును రచించి అభినవ పోతనగా పేరెన్నికగన్న శ్రీ వానమామలై వరదాచార్యులుగారివంటివారు ఈ సంఘ కార్యవర్గ సభ్యులు. ప్రముఖనాటకకర్త, కథకులు శ్రీ భాగి నారాయణమూర్తిగారిందులో సభ్యులు. ఇలా అనేకులు పెద్దలు ఈ సంఘంలో సభ్యులు. గత పది సంవత్సరములలో ఎన్నడూ జరుగనంత పెద్దయెత్తున హైద్రాబాదు నగరములో తెలంగాణా రచయితల సంఘం వార్షికోత్సవాలు 1953 డిసెంబరు 13, 14 తేదీలలో జరిగినవి. ఈ సభలు హైద్రాబాదునగరము తెలుగువారిదని ఘంటాఘోషముగా చాటినవి. ఈ సభలను ప్రారంభిస్తూ హైద్రాబాదు ప్రభుత్వ ముఖ్యమంత్రి డా॥ బూర్గుల రామకృష్ణరావుగారు తమ ఉపన్యాసములో ఇలా అన్నారు.

"ఆంధ్రసారస్వత చరిత్రలో నూతన స్వర్ణయుగమొకటి ప్రారంభమైనదని చెప్పినచో అతిశయోక్తికాదు. రచయితలుకూడ సంఘముగా పనిచేయుచున్నారు. తెలంగాణా రచయితల సంఘము చేసిన ప్రచురణములను అఖిల ఆంధ్ర పత్రికలు ప్రశంసించినవి. పలువురు విజ్ఞులు వేనోళ్ళ కొనియాడినారు. ఈ సంఘము యొక్క భవిష్యత్తు ఉజ్జ్వలమైనదని మనవి చేయుటకు సందియములేదు"

—"మంజీర"నుండి.

విఖ్యాతపండితులు, ప్రముఖ కవులు శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు సాహిత్యగోష్ఠి ప్రారంభిస్తూ ఇలా అన్నారు.

"నిన్నటినుండి ఈ సభా ప్రాంగణంలో ఉప్పొంగే నవచైతన్యం నాకెక్కడలేని ఉత్సాహం కలిగిస్తున్నది. సుమారు పదేళ్ళలోపుగా ఇంతటి చైతన్యోజ్జ్వలమైన సాహితీ సమావేశం చూడలేదంటే అతిశయోక్తికాదు. ఇక్కడ కనపడే అకుపచ్చ ఉత్సాహం ఎర్రని ఆవేశం ముదిసినవారినిగూడా పరుగులెత్తించేటట్లుగావుంది. ఈమహాసభా ప్రాంగణంలో సాహిత్యరీత్యా విశాలాంధ్ర సిద్ధించింది. ఇంతేకాదు. ఈ సభావేదికమీద మహారాష్ట్ర, కర్ణాట సాహిత్యవేత్తలు ఆప్త బుద్ధితో తమ ఆంధ్ర సాహిత్యప్రియతను వెల్లడించడం ఎంతో ఇంపుగావుంది. ఈ అవకాశం అన్యత్రలేదు........"

—"మంజీర"నుండి.

రచయితల సంఘంవారికి రాష్ట్రేతరుడు, తెలంగాణ వాసుడను సంకుచితభావం వుందని ఈ విమర్శకుడు తన విమర్శలో అన్నాడు. అది శుద్ధాబద్ధము. విశాలాంధ్రకై పది సంవత్సరాలనుండి గొంతు తడియార అరుసాచి ఎలుగెత్తి పల్కిన కవులుగల ఈ సంస్థను ఇట్లు నిందించుట కేవలము తగనిపని. దీనికి జవాబుగా నేను శ్రీ ఇంద్రగంటివారి ఉపన్యాసమందలి కొన్ని పంక్తుల నుదహరింతును.

"ఈ మహాసభా ప్రాంగణంలో సారస్వత రీత్యా విశాలాంధ్ర సిద్ధించింది. తీరాంధ్రులు, మధ్యాంధ్రులు రాయలసీమాంధ్రులు ప్రాతినిధ్యం వహించి ఇందు పాల్గొనడం భావి శుభసూచనం, మీ బంధుప్రీతికి తార్కాణం."

—"మంజీర"నుండి.

శ్రీ సి. నారాయణరెడ్డి ఆ మధ్య "తెలుగు స్వతంత్ర"లో "ఎక్సరేకళ్ళలోంచి" అన్న గేయం ప్రకటిస్తూ "ఇక్కడ అంతా అగస్త్యులు; అగస్త్య భ్రాతలు కీరు" అన్నట్లు జ్ఞాపకం. ఈ సంఘంలో విద్యావేత్తలే వున్నారుగాని మిడిమిడి జ్ఞానంతో ఉట్టిని ఎక్కలేని అమ్మ స్వర్గానికి ఎక్కజూచినట్లు తెలుగుపద్యం అర్థం చెప్పలేనివాడు మురారి నాటకాన్ని పరిశీలించే విమర్శకుల కొంటె వ్రాతలకు లోకము మోసపోదు. ఈమధ్య మరి యొక విమర్శకుడు రచయితల కర్తవ్యాన్ని ప్రబోధిస్తూ వీరు ఇలా చేయాలి, వారు అలా చేయాలి అని ఆదేశాలిచ్చాడు. ఊరికే మూల కూచుని ఊహించి రాసే రచయిత రచనల పేలవంగానే వుంటుంది. దేశీయ సమస్యలను పరిష్కరించడంలో జరిగే ఉద్యమాలను తప్పించుకోకుండా అందులో నిర్భయంగా పాల్గొంటేనేగాని ప్రత్యక్షానుభవం కలుగదు. అప్పుడుగాని రచనలో చేవ రాదు. ఈసందర్భాన నాకు ఇల్యాఎహ్రెన్‌బర్గు రచయితలను గూర్చి వ్రాసిన వ్యాసంలోని కొన్ని పంక్తులు జ్ఞాపకం వస్తున్నాయి. ఆ పంక్తులు ఇవి:

"రచయిత దేనిపైన బడితే దానిపైన, ఎవరిపై బడితే వారిపైన వ్రాయలేడు. రచయిత స్వీయ చరిత్రచేత, తన అనుభవం, తన ప్రవర్తనచేత కూడా ప్రభావితుడై నిశ్చయింపబడిన తన రచన సాగించుతాడు. ఒకరి ఆజ్ఞానుసారం రచయితలు వ్రాయలేరు..."

రచయితలకు కర్తవ్య బోధ చేసే ఈ బాధ్యతా రహిత కృతిమజీవులు దేశీయ సమస్యల్ని చూచి పారిపోయే పిరికిపందలు. వీరికి రచన అసలు చేత కాదు సరిగదా రచన చేయలేక నిరాశ జెంది రంధ్రాన్వేషకులుగా కువిమర్శకులుగా సిద్ధమౌతారు. ఉదాహరణగా ఒకరిద్దరు తెలంగాణా రచయితల త్యాగశీలత, వారి అనుభవాలు వారి రచనలకు ఎలా దోహదం చేశాయో ఈ విమర్శకులకు తెలియాలని ఇక్కడ రాస్తాను. శ్రీ కాళోజీ నారాయణరావు శ్రీ వట్టికోట ఆళ్వారుస్వామి గారలను తీసుకుందాం. వీరి జీవితం ఇంచుమించు బాల్యంనుండి ఇప్పటివరకూ దేశ స్వాతంత్ర్యోద్యమంలోనే గడిచింది. ఏండ్ల తరబడి కారాగారావాసక్లేశం అనుభవించారు. సర్వం త్యజించారు. పొట్టకూటికై ప్రాకులాడే గడియలు వీరి జీవితంలో వీరికి లభించలేదు. వీరి విశేషానుభవాలు తమ రచనల్లో అంతటా రవ్వల్లా కనిపిస్తాయి. నిజాం నిరంకుశ ప్రభుత్వాన్ని ఎప్పుడు ఎదుర్కోవలసి వచ్చినా వీరు ముందున్నారు. శుష్కించిన దేహంతో హాస్పిటలు ఆవరణంలో తుక్కు మంచంలో (వరంగల్లు సెంట్రలు జైల్లో) శ్రీ కాళోజీ గారు నాకు కనిపించారు 18 సెప్టెంబరు 1947 నాడు. 30 సెప్టెంబరు 1947 నాడు నిజామాబాదు కారాగృహంలో శిక్షపొందిన సాధారణ ఖైదీలు (క్రిమినల్సు) తొడుక్కునే చీరలుగల చడ్డీ చిన్ని అంగీ, నెత్తిన చీరలటోపీ, ఒక చిన్న తువ్వాలుతో శ్రీ ఆళ్వారుస్వామి సాక్షాత్కరించాడు. ఇంత ప్రముఖుడైన దేశభక్తుణ్ణి సాధారణ ఖైదీ తొడుక్కునేదుస్తుల్లో నిర్బంధించివుంచారు. ఏ కాస్తా జంకులేని ధీర గంభీరమైన ముఖం, ఎర్రని ఆజానుబాహు విగ్రహం. అట్లా నాలుగు సంవత్సరాలు ఏకధాటిగావున్నాడు జైల్లో. ఇదివరకెన్ని నిర్బంధాలకు గురియైనాడో. ఈయన వ్రాసిన "జైలులోపల" అన్న కథల సంపుటిలో "ప్రజల మనిషి" అనే ఈయన అముద్రిత నవలలో తెలంగాణ ప్రజాజీవితం సుస్పష్టంగా కనిపిస్తుంది. కాళోజీగారి "నా గొడవ" కావ్య సంపుటిలో ఆయన తెగువ, ఉదాత్తత, ఉత్తేజం కనిపిస్తాయి. ఉద్వేగం అనుభవాలవల్లగాని రాదు. కాలికొక గండపెండేరం వేసుకుని పెద్దలమనుకునే వారూ, విద్యాశాఖకు చెందిన ఉన్నతోద్యోగులను బులిపించి, టెక్స్టుబుక్కు కమిటీలలో సభ్యత్వము సంపాదించి బంధువుల పుస్తకాలు ప్రిస్క్రైబు చేసుకుని వేలుగడించే జడులూ యీ త్యాగశీలురైన రచయితలముందు "బాలతృణ" ప్రాయులు. ఎహ్రెన్‌బర్గు వక్కులను ఈ విమర్శకులుమననంచేసుకోవాలని సవినయంగా ప్రార్థన.

తెలంగాణా రచయితల సంఘానికి మూలస్తంభాలైన పై ఇరువురు వ్యక్తుల జీవితానుభవాలలో అణుమాత్రంలేని కృతిమ రచయితలు వారి విశాలకీర్తిని చూచి ఈర్ష్యపడి నిందించడానికి పూనుకుంటారు. ఎంతతప్పు చెప్పండి ఇలాచేయడము? సాహిత్యోద్యమాలు నిచ్చెనలుగా చేసుకొని సమయం కనిపెట్టి పార్లమెంటు సభ్యుడగుటకు ప్రయత్నిస్తాడొకడు. దురదృష్టవశాన జనం అతన్ని ఓడగొట్టారనుకోండి, స్టేట్ కౌన్సిలు సభ్యుడు కావాలని నానాగడ్డి కరచి రాజకీయ పక్షాల నాయకుల తోకపట్టుకుని తిరుగుతాడు. ఏవ్యక్తి ఎన్నికలో పోటీచేస్తున్న నియోజకవర్గములో తాను అతనికి వ్యతిరేకంగా ప్రచారం చేశాడో ఆ వ్యక్తి గెలిచి మంత్రికాగానే (తాను అతనికి వ్యతిరేకంగా బాహాటంగా చేసిన ప్రచారాన్ని తానే మరిచి లజ్జలేక) ఆ మంత్రినే తన సంస్థకు ట్రస్టీగా వేసుకుంటాడు. అతని అడుగులకు మడుగులొత్తుతాడు. సాహిత్యంలోకూడా ఇట్టివాళ్లు వేలుపెట్టడం బాగుంటుందా చెప్పండి!

ప్రజాస్వామిక యుగంలో దేశభక్తులైనవాళ్లు ప్రభుత్వ యంత్రంలోకి రావడం యెంత మేలో రచయితలుగా కూడా త్యాగశీలురైన అనుభవజ్ఞులు వెలువడడం అంత మంచిది. అందుకు విరుద్ధంగా జరిగితే దేశానికి అపకారం జరిగినట్టే సాహిత్యానికీ అపకారం జరుగుతుంది.

ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రధాన కార్యదర్శి శ్రీ పులిజాల హనుమంతరావుగారు వ్రాస్తూవరి

షత్తు కార్యకర్తలు చేయలేని కార్యములు కొన్ని వున్నవన్నారు. మనం చేయలేని పనులను చెప్పుకోవడం తప్పేమీ కాదు. హనుమంతరావుగారి సహృదయత కొనియాడతగ్గదే. అట్లే తెలంగాణా రచయితల సంఘం చేయలేని పనులు కొన్ని వున్నాయి. అవికూడా ఇక్కడ ఉదహరిస్తే విమర్శకులైన వారికి వాస్తవాలు తెలుస్తై. దేశం నలుమూలలా రాత్రిపాఠశాలలు నడుపుతున్నామనీ, రోజుకు అనేకులు అక్షరాస్యులౌతున్నారని బుకాయించి యేటేటా ప్రభుత్వంనుండీ ప్రజలనుండీ డబ్బుకొట్టి స్వప్రయోజనాలకోసం వాడుకోడం రచయితల సంఘంవారికి రాదు. రచయితల సంఘానికి సాలీనా ప్రభుత్వ సహాయం ఇంతవరకూ లేదు. ఇక విద్యాశాఖకు చెందిన ఉన్నతాధికారుల నాశ్రయించి విద్యాభివృద్ధి కమిటీలలో సభ్యత్వం సంపాదించడం, స్వతంత్రంగా ఊహించ గలవాళ్ళను దూరంతోసి తొత్తులను ప్రోత్సహించడం, సభ్యులుగా తమవాళ్ళనేగాని ఇతరులను చేర్చుకోకపోవడం దేశంకానిదేశంలో దూరాన భయం భయంగా సర్వసభ్యసమావేశాలుజరపడం, ఒకనాడు కలెక్టరు అధ్యక్షతకే తృప్తిపడి నేడు అఖిలభారత ఖ్యాతినార్జించిన వారిచే ప్రారంభాలు చేయించి మన్ననలు పొందడానికి ప్రయత్నించడం, సాహిత్యంతో సంబంధంలేని వారికి కార్యవర్గ సభ్యత్వం ఇవ్వడం మొదలగు స్వార్థపరక్రియాకలాపములు రచయితల సంఘమునకు చేతకావు. తెలంగాణా రచయితల సంఘం—తెలుగు రచయితలసంఘం (మద్రాసు) అభ్యుదయసమితి (నిడదవోలు), శరజ్జ్యోత్స్న సాహితీ సమితి (పిప్పల), నన్నయభట్టారక గ్రంథాలయపీఠము (తణుకు) కర్నాటక సాహిత్య పరిషత్తు (హైదరాబాదు), రాజశ్రీ కళాపీఠము (సికింద్రాబాదు) సాధన సమితి (హైద్రాబాదు) సాహితీ మిత్రబృందం (ఖమ్మం) దక్షిణభారత్ హిందీప్రచారసభ (మద్రాసు, హైదరాబాదు) రాయలసీమ సాహిత్యపరిషత్తువంటి అనేక సాహిత్య సంస్థలతో కలసి మెలసి వీని కార్యక్రమములయందు సంపూర్ణముగా సహకరించుతూ వారి సహకారమును పొందుతూ ఆంధ్ర సాహిత్య వికాసమే ధ్యేయంగా, యువరచయితలను ప్రోత్సహించి సాహిత్యసర్జనశక్తికి దోహదం కలిగించడం ఆశయంగా నిష్కల్మషుల హృదయంలో ఎట్టి త్యాగాలకైనా వెనుదీయక సాహిత్యానికి జీవితాలను ధారాదత్తం చేసినవారు వెంటరాగా నాగరకతకు పతాకప్రాయమైన నవ్యసాహితి పురోగమిస్తున్నది. కువిమర్శలు ఝంఝానిలం ముందు శుష్కఘాసంవలె ఊరూ పేరూ లేకుండా ఎగిసిపోతాయి.

కవిత లేకయున్న యువత శూన్యంబౌను
యువత లేకయున్న నవత సున్న
నవత లేకయున్న నాగరకత లేదు
నాగరకత లేక నాడు లేదు.

---

# రాగమాలిక

రవి కిరణాలకు ద్రవించి
స్రవించే, హిమశిలగా మారిన
యుగదేవత నీలాంబర నేత్రాల్లో
రక్తరేఖా చిత్రాలు చిత్రించి

అచలిత అశాంచల వేదికపై
చంచల కాలాంగన ముగ్ధభావ
పదవిన్యాసం యెరుగని,
కవితా పక్షాంచలాలు గప్పుకొన్న

ఊహానగ్నిక సాధానికి
మహాప్రజ మహానంద
భావవాటికా పురోగతికి
కవితాసోపానాలను రచించీ

తెగిపోయిన వీణాతంత్రులపై
అనలరాగ వల్లిక లెగప్రాకించినాను

పాదాలను పెనవైచిన
తమోవల్లికలను ద్రుంచి
రవి కరాల కందించితి
నా గేయ రాగ మాలికా
బంధిత కరయుగళి.

—"మాదిరాజు"

మత్తు కార్యకర్తలు చేయలేని కార్యములు కొన్ని వున్నవన్నారు. మనం చేయలేని పనులను చెప్పుకోవడం తప్పేమీ కాదు. హనుమంతరావుగారి సహృదయత కొనియాడతగ్గదే. అట్లే తెలంగాణా రచయితల సంఘం చేయలేని పనులు కొన్ని వున్నాయి. అవికూడా ఇక్కడ ఉదహరిస్తే విమర్శకులైన వారికి వాస్తవాలు తెలుస్తై. దేశం నలుమూలలా రాత్రిపాఠశాలలు నడుపుతున్నామనీ, రోజుకు అనేకులు అక్షరాస్యులౌతున్నారని బుకాయించి యేటేటా ప్రభుత్వంనుండీ ప్రజలనుండీ డబ్బుకొట్టి స్వప్రయోజనాలకోసం వాడుకోడం రచయితల సంఘంవారికి రాదు. రచయితల సంఘానికి సాలీనా ప్రభుత్వ సహాయం ఇంతవరకూ లేదు. ఇక విద్యాశాఖకు చెందిన ఉన్నతాధికారుల నాశ్రయించి విద్యాభివృద్ధి కమిటీలలో సభ్యత్వం సంపాదించడం, స్వతంత్రంగా ఊహించగలవాళ్ళను దూరంతోసి తొత్తులను ప్రోత్సహించడం, సభ్యులుగా తమవాళ్ళనేగాని ఇతరులను చేర్చుకోకపోవడం దేశంకానిదేశంలో దూరాన భయం భయంగా సర్వసభ్యసమావేశాలుజరపడం, ఒకనాడు కలెక్టరు అధ్యక్షతకే తృప్తిపడి నేడు అఖిలభారత ఖ్యాతినార్జించిన వారిచే ప్రారంభాలు చేయించి మన్ననలు పొందడానికి ప్రయత్నించడం, సాహిత్యంతో సంబంధంలేని వారికి కార్యవర్గ సభ్యత్వం ఇవ్వడం మొదలగు స్వార్థపరక్రియాకలాపములు రచయితల సంఘమునకు చేతకావు. తెలంగాణా రచయితల సంఘం—తెలుగు రచయితలసంఘం (మద్రాసు) అభ్యుదయసమితి (నిడదవోలు), శరజ్జ్యోత్స్నా సాహితీ సమితి (పిప్పల), నన్నయభట్టారక గ్రంథాలయపీఠము (తణుకు) కర్నాటక సాహిత్య పరిషత్తు (హైదరాబాదు), రాజశ్రీ కళాపీఠము (సికింద్రాబాదు) సాధన సమితి (హైద్రాబాదు) సాహితీ మిత్రబృందం (ఖమ్మం) దక్షిణభారత్ హిందీప్రచారసభ (మద్రాసు, హైదరాబాదు) రాయలసీమ సాహిత్యపరిషత్తువంటి అనేక సాహిత్య సంస్థలతో కలసి మెలసి వీని కార్యక్రమములయందు సంపూర్ణముగా సహకరించుతూ వారి సహకారమును పొందుతూ ఆంధ్ర సాహిత్య వికాసమే ధ్యేయంగా, యువరచయితలను ప్రోత్సహించి సాహిత్యసర్జనశక్తికి దోహదం కలిగించడం ఆశయంగా నిష్కల్మషుల హృదయంలో ఎట్టి త్యాగాలకైనా వెనుదీయక సాహిత్యానికి జీవితాలను ధారాదత్తం చేసినవారు వెంటరాగా నాగరకతకు పతాకప్రాయమైన నవ్యసాహితి పురోగమిస్తున్నది. కువిమర్శలు ఝంఝానిలం ముందు శుష్కఘాసంవలె ఊరూ పేరూ లేకుండా ఎగసిపోతాయి.

కవిత లేకయున్న యువత శూన్యంబౌను
యువత లేకయున్న నవత సున్న
నవత లేకయున్న నాగరకత లేదు
నాగరకత లేక నాడు లేదు.

---

# రాగమాలిక

రవి కిరణాలకు ద్రవించి
స్రవించే, హిమశిలగా మారిన
యుగదేవత నీలాంబర నేత్రాల్లో
రక్తరేఖా చిత్రాలు చిత్రించి

అచలిత అశాంచల వేదికపై
చంచల కాలాంగన ముగ్ధభావ
పదవిన్యాసం యెరుగని,
కవితా పక్షాంచలాలు గప్పుకొన్న

ఊహానగ్నిక సాధానికి
మహాప్రజ మహానంద
భావవాటికా పురోగతికి
కవితాసోపానాలను రచించి

తెగిపోయిన వీణాతంత్రులపై
అనలరాగ వల్లిక లెగప్రాకించినాను

పాదాలను పెనవైచిన
తమోవల్లికలను త్రుంచి
రవి కరాల కందించితి
నా గేయ రాగ మాలికా
బంధిత కరయుగళి.

—"మాదిరాజు"

Source: Press Academy Website, Telugu Swatantra Patrika, Mar,Apr,May 1954

**Disclaimer:** This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan
http://www.maganti.org/